క్లుప్తంగా

రాష్ట్రంలో ఆటవిక పాలన



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని లావేరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దన్నాన రాజి నాయుడు అన్నారు. లావేరు మండలంలోని లింగాలవలస, పోతయ్యవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మండల నాయకులు రొక్కం బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, మండల నాయకులు దేశెట్టి తిరుపతి రావు, మీసాల శ్రీనివాసరావు ఉన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు



కందకాలకు కొలతలు తీస్తున్న ఉపాధి సిబ్బంది

రణస్థలం: మండలంలోని 34 పంచాయతీల్లో భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపడుతున్నామని ఎంపీవో శ్రీనివాసనాయుడు తెలిపారు. కొండములగాం పంచాయతీలో భూగర్భ జలాల పెంపునకు తవ్విన కందకాలును సోమవారం పరిశీలించారు. ఆయనతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు 31 వరకు గడువు

రణస్థలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎం.బైపీసీ, ఒకేషనల్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి తెలిపారు. అర్హత ఉన్నటువంటి విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలతో పాటు, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, హాస్టల్ సదుపాయం వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలియజేశారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికబద్ధంగా పాఠ్యంశ బోధన ఉంటుందని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గార: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని ఎస్ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. మండలంలోని వమరవల్లి బాలికల గురుకుల పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటిని ఎదుర్కొనే విధానాలను తెలియజేశారు. మత్తు పదార్థాలతో కలిగే నష్టాలు తెలుసుకోవాలని, ఉజ్వల భవిష్యత్ కోసం చదువుపై ఏకాగ్రత, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

పలకలు సరిచేశారు



పలకలు సరిచేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో రోడ్లపై పలకలు సరిగా లేకపోవడం, రోడ్డుపైనే నిర్మాణ పలకలతో ప్రయాణికుల ఇబ్బందులపై 'ఇదేం తీరు' అనే శీర్షికతో సాక్షి పత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు నగరంలోని జి.టి.రోడ్డు నుంచి జేసి బంగ్లాకు వెళ్లేదారిలో, సరస్వతీ మహల్ కూడలి వద్ద రోడ్డుపై వేసి ఉన్న పలకలు సరిచేశారు. దీనిపై స్థానికులు, అటువైపు వెళ్లే ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.

పశువులు పట్టివేత

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద బరంపురం నుంచి విశాఖపట్నం వైపు వ్యానులో తరలిస్తున్న 21 పశువులను జే.ఆర్.పురం పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యాను, అందులోని వ్యక్తులను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. పశువులను గోశాలకు తరలించడమైనది వివరించారు.

ఆగస్టు నుంచి ఆటో మ్యూటేషన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని విలీన పంచాయతీల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి క్రయ, విక్రయాలు జరిగినట్లయితే కొనుగోలుదారుని పేరున ఇంటిపన్నులు, ఖాళీస్థలం పేరు మార్పులు నేరుగా ఆటో మ్యూటేషన్ పద్ధతి ద్వారా జరుగుతుందని కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



రామలక్ష్మణ కూడలిలో రోడ్డుకి అడ్డంగా వెళ్తున్న గేదెలు



హడ్కోకాలనీలో గుంపులుగా ఉన్న కుక్కలు



టౌన్‌హాల్ సందులో ఇలా...

- పందులు, కుక్కలు, పశువుల స్వైర విహారం
- చీకటిపడితే రోడ్లపైనే సంచారం
- పలువురిపై దాడులు
- పట్టించుకోని అధికారులు



ఉమెన్స్ కాలేజీ రోడ్డులో గేదెలు

నగరం.. నరకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

శ్రీకాకుళం నగరంలో పందులు, పశువులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రివేళల్లో గుంపులు గుంపులుగా పరుగులు పెడుతున్నాయి. కొంచెం చీకటిపడితే చిన్నారులు, వృద్ధులపైకి వచ్చి దాడులు చేస్తున్నాయి. వీటిలో కుక్కల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితుల్లో ఆ చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఇటీవల హడ్కో కాలనీలోని ఒక చిన్న అబ్బాయి మీద కుక్క దాడిచేసి కాటువేసింది. గుజరాతీపేట, ఆదివారంపేట, బొందిలిపురం, ప్రభాకర్‌నగర కాలనీ, మడ్డివీధి, ప్రకాశ్‌నగర్ కాలనీ, బలగ, బుచ్చిపేట, చెరువుగట్టువీధి,



బగాది రామ్మోహన్‌కాలనీలో గుంపుగా ఉన్న పందులు

పెద్దరెల్లివీధి, దమ్మలవీధి, కలెక్టర్ బంగ్లా, వాంబే కాలనీల్లో వందల సంఖ్యలో కుక్కలు విహరిస్తున్నాయి. రాత్రి వేళల్లో భయంకరమైన అరుపులతో నిద్రపట్టకుండా చేస్తున్నాయి.

ఇళ్లలోకి పందులు

మరోవైపు పందులతో కాలనీలు అధ్వానంగా మారుతున్నాయి. గుంపులు గుంపులుగా నేరుగా ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. వీటివలన మెదడు వాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పందుల నియంత్రణ చేయాలని పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని నగరవాసులు చెబుతున్నారు. నగరంలో పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో చెత్త కుప్పల్లోకి పందులు చేరి చిందరవందరగా చేసి తీవ్ర దుర్వాసన వెదజల్లేలా చేస్తున్నాయి. దీనివలన దోమలు చేరి విషజ్వరాల బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

రోడ్ల మీదనే పశువులు

నగరంలోని చాలా చోట్ల గేదెలు, ఆవులు రోడ్ల మీదనే తిరుగుతుంటాయి. పశువుల యజమానులు పాలు పితుక్కుని తమకేం పట్టనట్లు రోడ్లుపై వదిలేస్తున్నారు. వీటిని నియంత్రించే చర్యలు మున్సిపల్ అధికారులు గానీ, ట్రాఫిక్ అధికారులు చేపట్టకపోవడం వెనుక ఆంతర్యం ఏంటో తెలియడం లేదని ప్రయాణికులు, నగరవాసులు అంటున్నారు. జిల్లా పరిషత్ రోడ్డులో నేరుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పశువులు రోడ్డుపై విచ్చలవిడిగా మరోసారి కనిపిస్తే చర్యలు తప్పవని నియంత్రణకు చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులకు చెప్పినా, మూడు రోజులు నియంత్రించి తర్వాత ఎప్పటిలాగే వదిలేశారు. దీంతో ఈ పశువులు రోడ్డుపై తిరగడం వల్ల ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



నగరంలో కుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఏబీసీ పద్ధతిలో కుక్కలకు ఆపరేషన్లు చేయిస్తున్నాం. పందులు విచ్చలవిడిగా తిరుగుతున్న విషయం మా దృష్టిలో లేదు. పందులు, పశువుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి విచ్చలవిడిగా రోడ్ల పైకి వదిలేయకుండా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే యజమానులకు అపరాధ రుసుం వేస్తాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత



వెల్పురాయిలో ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని వైఎస్సార్‌సీపీ రణస్థలం మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెల్పురాయి, సంచాం గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంగా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించారు. ప్రజల వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి నష్టపోయిన సంక్షేమ పథకాల జాబితాను తెలియజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రజల తరుపున పోరాటం చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పిల్ల ఆనంద పాత్రుడు, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, సంచాం సర్పంచ్ రెడ్డి రాము, ఎంపీటీసీ గురాన ప్రసాద్, మాజీ ఎంపీటీసీ కెల్ల రామకృష్ణ, నాయకులు మహంతి వెంకటప్పలనాయుడు, అప్పలనాయుడు, టేకి బ్రహ్మాజీ, దన్నాన సీతారాం, మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, రెడ్డి ఆనంద్, రెడ్డి రామకృష్ణ, వెంకునాయుడు, మీసాల దాలినాయుడు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బూటకపు మాటలతో పరిపాలన



వత్సవలసలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



తూలుగులో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గార: బూటకపు హామీలు, మాటలతోనే ఏడాదిగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని వత్సవలస, కొమరవానిపేట పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ అమలు, పథకాల అమలు తీరుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్ మరోసారి వచ్చేసినా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తెనుకోటి చెంచులక్ష్మి, పీస శ్రీహరిరావు, తెనుకోటి అప్పారావు, కోనాడ నర్సింగరావు, పుల్లటి నాగేశ్వరరావు, అంబటి చినబాబు, కోట రామారావు, బరాటం నాగరాజు, వమరవల్లి ఉదయభాస్కరరావు, వజ్జ వెంకటప్పలనాయుడు, కుత్తము బాలరాజు, సీహెచ్ శ్రీరాములు, మైలపల్లి నాగభూషణం, బాబూరావు, దాసరి పోలయ్య, పుక్కళ్ల పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

తూలుగులో...

అమలు చేయలేమని తెలిసినా, ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి కూటమి నాయకులు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అన్నారు. మండలంలోని తూలుగు పంచాయతీలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని కొయ్యాన నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తల్లికి వందనం పథకానికి ఇంకా అర్హులున్నా కొందరికే వేసి ప్రజలను మోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అంధవరపు బాలకృష్ణమూర్తి, ఊట అప్పలనాయుడు, సీహెచ్ ముకుందరావు, తాన్నె రమణ, తాన్నె అప్పన్న, తాన్నె గన్నెప్పడు, చిన్నప్పడు, ఇప్పిలి నగేష్, బంటుపల్లి రామారావు, తాన్నె అప్పన్న, బత్తిలి రామారావు, మెట్టపల్లి లక్ష్మణ, తాన్నె శ్రీను, తాన్నె రమణ, గణేష్, నారాయణరావు, బేపల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ మూడేళ్లలో ఇళ్లు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎల్ఆర్ అదనపు డైరెక్టర్ గోవిందరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న మూడేళ్లలో జిల్లాలో అర్హత గల ప్రతి కుటుంబానికి ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర స్థాయి సర్వే, భూమి నమోదు విభాగం అదనపు సంచాలకుడు ఆర్.గోవిందరావు సూచించారు. స్థలాలు అందుబాటులో లేని పట్టణ ప్రాంతాల్లో టిడ్కో గృహాల ద్వారా నివాస సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ, రీసర్వే, పీజీఆర్ఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ వేదికగా వచ్చిన ప్రతి అర్జీపై తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం తగదని స్పష్టం చేశారు. 2019 కన్నా ముందే అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ పూర్తిచేయాలన్నారు. ఈ ప్రక్రియను డిసెంబర్ 2025 నాటికి ముగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రీసర్వే 2.0 డిసెంబర్ 27 నాటికి పూర్తి కావాలని, ఆగస్టు 5 నాటికి గ్రామ సరిహద్దుల ఖరారును పూర్తి చేయాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీలో జాప్యం జరగకూడదని సూచించారు.

మురపాకను మండల కేంద్రం చేయాలి



నిరసన తెలుపుతున్న మురపాక మండల సాధన సమితి ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో లావేరు మండలంలోని మురపాక పంచాయతీని మండల కేంద్రంగా చేయాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వివేకానంద యూత్ సొసైటీ, మురపాక మండల సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. 1989లో మురపాక మండలం ఏర్పాటుకి గెజిట్ నోటిఫికేషన్ వచ్చిందని, కానీ రాజకీయ కారణాల వలన ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతన మండలాల ఏర్పాటుకి క్యాబినేట్ సబ్ కమిటీ వేసిన నేపథ్యంలో, మురపాక మండలం ఏర్పాటు చేయాలని వివేకనంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బాలి శ్రీనివాస నాయుడు కోరారు. కార్యక్రమంలో మురపాక ఉపసర్పంచ్ వడ్డి సూర్యకుమార్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ వడ్డి అప్పయ్య, మురపాక మండల సాధన సమితి సభ్యులు ప్రగడ శ్రీను, ఏటూరి కృష్ణ, గొర్లె శ్రీనుబాబు, పిసిని రాంబాబు, గొర్లె హరీష్, ప్రగడ గోవింద్, పెయ్యల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ



వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఖ్యాతి ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులను బ్రహ్మకుమారిలు, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు సోమవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డి.పార్వతీశం, బుడుమూరు సూర్యారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాజారావు, ఉపాధ్యాయుడు త్రినాథరావు, రాజయోగి ఎక్స్‌ప్రెస్ ఆర్మీ రమణ, నిర్మల, బ్రహ్మకుమారి సభ్యురాలు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



శ్రీకాకుళం న్యూకాలనీ: సత్యభార్గవ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: చరణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏషియన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పతకం సాధించిన అట్టాడ చరణ్ జిల్లాకు గర్వకారణంగా నిలిచాడని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయనను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు మెజ్జాడ వెంకటరమణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు వై.పోలినాయుడు, కె.రామచంద్రుడు, రవి, ఎన్వీ రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇటీవల హర్యానాలోని రోతక్ వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక ఆలిండియా జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో రజత పతకంతో మెరిసిన సిక్కోలు యువ బాక్సింగ్ సంచలనం గంధం సత్యభార్గవ్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో సిక్కోలు ప్రాతినిధ్యం ఉండేలా మరింతలా రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న కోచ్ ఉమామహేశ్వరరావు, బాక్సింగ్ సంఘ జిల్లా ప్రతినిధులను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్, వంగా మహేష్, డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్ రావు, జిల్లా బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: లావేరు మండలంలోని చిన్నకొత్తకోట గ్రామానికి చెందిన ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ తండ్రి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ లింగాల అప్పలస్వామి ఇటీవల మరణించారు. దీంతో వారి స్వగృహానికి సోమవారం వెళ్లి ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వాళ్లే దాలినాయుడు, సర్పంచ్ కొత్తకోట భాస్కరరావు, ఎంపీటీసీ గంట్యాడ సత్యం, మాజీ ఎంపీటీసీ గుమ్మడి దుర్గారావు, నాయకులు లింగాల వెంకటరావు, కుప్పయ్య, లుట్ట ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నేడు బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–18 బాలబాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు మంగళవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. నగరంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలోని బాస్కెట్ బాల్ కోర్టులో సాయంత్రం 5 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు వయస్సు కలిగి, ఆసక్తి ఉన్న బాలబాలికల తమ ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, టెన్త్ క్లాస్ మార్క్స్ మెమో, ఆధార్ కార్డుతో ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99492 91288 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమస్యలుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదులో సమస్యలుంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కోరారు. పట్టణంలోని డీఆర్వో చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్ట్రోరల్ రోల్స్, తదితర అంశాలపై సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు, శంకరరావు, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.51 లక్షలకు వేలంపాట ఖరారు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో స్వామివారికి అలంకరిస్తున్న పువ్వులు, భక్తులు సమర్పించిన పువ్వులతో అగరుబత్తుల తయారీ హక్కుల టెండర్ రూ.3.51 లక్షలకు ఖరారయ్యింది. ఈ మేరకు ఆలయంలో సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ద్వారకా తిరుమలకు చెందిన సీహెచ్ రాజేష్ అధికంగా పాడడంతో, అతడికి హక్కులను అప్పగించేలా చర్యలు చేపడతామని ఆలయ ఈవో కేఎస్ వీడీవీ ప్రసాద్ ప్రకటించారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 12వ డివిజన్ ఇన్‌చార్జి పొన్నాడ రుషి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శిమ్మ రాజశేఖర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుకాపు, కళింగ వైశ్య కులాల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏ గడప తొక్కినా కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు ఏకరువు పెడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏడాది కాలంగా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఇద్దుముల శోభన్‌బాబు, సాధు వైకుంఠరావు, బుక్కూరు ఉమామహేశ్వరరావు, రౌతు శంకరరావు, టి.కామేశ్వరి, గద్దిబోయిన కృష్ణ యాదవ్, సుగుణారెడ్డి, పాపారావు, వానపల్లి రమేష్, కర్రి రంగాజీదేవ్, త్రినాథరావు, నల్లబారికి శ్రీనివాసరావు, తారక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసాలతోనే ఏడాది పాలన



సానివాడలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

శ్రీకాకుళం రూరల్: ఏడాది కూటమి పాలనంతా మోసాలతోనే సాగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుయ్యబట్టారు. మండల పరిధిలోని ఇప్పిలి, కల్లేపల్లి, కిష్టప్పపేట, సానివాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, చల్లా రవికుమార్, బాణ నర్సింగరావు, గంగు నరేంద్రకుమార్, గొండు కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, గేదెల శంగల్వరావు, చిట్టి రవికుమార్, ఎచ్చెర్ల శ్రీధర్, వి.కృష్ణారావు, రౌతు శంకరావు, రుప్ప అప్పలసూరి, బగ్గు అప్పారావు, గుండ హరీష్, శిమ్మ భగవాన్‌దాస్, బాణ శ్రీను, ముద్దాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం సమగ్ర పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

శ్రీకాకుళం రూరల్: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన నిధుల వినియోగం, వాటి ప్రగతిని క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఒక ఉన్నత స్థాయి కేంద్ర బృందం శ్రీకాకుళం జిల్లాలో విస్తృతంగా సోమవారం పర్యటించింది. దీనిలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలంలోని రాగోలు, శిలగాం, శింగువలస గ్రామాలను సందర్శించారు. పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి అందుతున్న ప్రయోజనాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకం ద్వారా నిర్మించిన గ్రామీణ రహదారుల నాణ్యత, వాటి నిర్వహణ తీరుతెన్నులను అంచనా వేశారు. హార్టికల్చర్ అభివృద్ధి పనులు, రైతుల ఆదాయ వృద్ధికి దోహదపడుతున్నాయో లేదో తెలుసుకున్నారు. పరిశీలన ఆధారంగా త్వరలో ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని తెలిపారు.